# లాభాల స్వీకరణకు ముందు

# మరిన్ని లాభాలు




**సమీక్ష** : అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లతో గత వారం మార్కెట్ లాభాల బాట పట్టింది. ఐరోపా సంక్షోభ పరిష్కారానికి జర్మనీ, ఫ్రాన్స్ అధినేతలు మద్దతు ఇస్తామని ప్రకటించడం దేశీయ మార్కెట్లు సానుకూలంగా కదలడానికి తోడ్పడ్డాయి. కేంద్రం కొత్త టెలికాం విధాన ముసాయిదాను ప్రకటించడం; ఇన్ఫోసిస్ అంచనాలకు మించి రాణించడం కూడా మార్కెట్లకు ఊతమిచ్చింది. అంతక్రితం నెలతో పోలిస్తే ఆగస్టు పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) మెరుగ్గా ఉండడం; ఆహార ద్రవ్యోల్బణం; టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు కాస్త తగ్గుముఖం పట్టడం సెంటిమెంటును మెరుగుపరచాయి. వారం మొత్తం మీద సెన్సెక్స్ 850 పాయింట్లు లాభపడి, 17,083 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల పనితీరు** అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతల మధ్య ఎఫ్ఐఐలు రూ.2,270.40 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. మ్యూచువల్ ఫండ్లు సైతం నికరంగా రూ.819.90 కోట్ల కొనుగోళ్లు చేయడం విశేషం.

**రంగాల వారీగా** అంతర్జాతీయ మార్కెట్ ధోరణికి తోడు సానుకూల ఆర్థిక ఫలితాల కారణంగా ఐటీ రంగం లాభాల్లో ముందు నిలిచింది. ఆర్‌బీఐ కీలక రేట్ల పెంపు ముగింపు దశకు చేరిందన్న అంచనాలు బ్యాంకింగ్ సూచీకి లాభాలను తెచ్చిపెట్టాయి. మన్నికైన వినియోగదారు వస్తువులు కూడా కొనుగోలుదారులను ఆకర్షించగలిగాయి. ఔషధ (ఫార్మా), వస్తు (ఎఫ్ఎమ్‌సీజీ) రంగాలకు మదుపర్లు ఈ వారం దూరం జరిగారు. పెట్టుబడుల్లో మందగమనం దృష్ట్యా యంత్ర పరికరాల సూచీ డీలా పడింది.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదవడం బట్టి చూస్తే , గత కొద్ది రోజుల లాభాల అనంతరం మార్కెట్ స్థిరీకరణ దశలో ఉండడాన్ని సూచిస్తోంది.

**భవిష్యత్ అంచనా** సెన్సెక్స్ 17212 స్థాయిని అధిగమిస్తే కనుక మార్కెట్లో రికవరీ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. అయితే 18000 వద్ద దీనికి నిరోధం ఎదురుకావచ్చు. ఒక వేళ సెన్సెక్స్ 16600 పాయింట్ల కన్నా దిగువకు జారితే మాత్రం మార్కెట్లు స్వల్పకాల అధోముఖ ధోరణిలోకి ప్రవేశించొచ్చు.

**ప్రభావిత అంశాలు** ఐరోపా మార్కెట్లో సెంటిమెంటు మెరుగవడం; అమెరికా గణాంకాలు అంచనా మించి రాణించడం వల్ల ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా ఉన్నాయి. మరింత దిశ కోసం మన మార్కెట్లు వాటిపై కన్నేయవచ్చు. జి-20 సదస్సు పరిణామాలను కూడా గమనించవచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలు కనిపించవచ్చు. 20న విడుదలయ్యే వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఈ నెల 25న ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్షపై ప్రభావం చూపగలదు. రూపాయి మరింత క్షీణిస్తే ఎగుమతి ఆధారిత రంగాలు లాభపడొచ్చు. చమురు ధరలు పెరిగితే మార్కెట్‌లో లాభాలు పరిమితంగా ఉండొచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 17212, 17482, 17665; **తక్షణ మద్దతు స్థాయిలు:** 16854, 16756, 16608

**ప్రస్తుత రికవరీ కారణంగా లాభాల స్వీకరణకు ముందు మరిన్ని లాభాలు కనిపించవచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*